ప్రజాశక్తి
శుక్రవారం 22 సెప్టెంబర్ 2023 5 అనంతపురం



రాష్ట్ర సరిహద్దు దాటుతున్న చౌకబియ్యం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేస్తున్న చౌక బియ్యాని కొందరు స్వార్థపరులు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి అక్రమంగా కర్నాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. రేషన్ బియ్యం సంచుల లోడుతో పోలీస్ స్టేషన్ ముందే వెళ్తున్నా అడిగే వారే కరువయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై తహశీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా డీలర్ల ద్వారా వెళ్లడం లేదని, కొందరు వినియోగదారులే వ్యాపారులకు అమ్ముతున్నారని తెలుపుతూ సమాధానం దాటవేశారు.



రేషన్ బియ్యం తరలించేందుకు సిద్ధం చేసిన వాహనం



2020లో అనంతపురంలో ప్రారంభం అయిన కిసాన్ రైలు (ఫైల్ ఫోటో)

కిసాన్ రైల్ కిదర్‌హై..?

ఉద్యానవన రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ రైల్ పేరుతో మూడేళ్ల క్రితం హడావుడి చేశాయి. ముచ్చటగా మూడు రైళ్లు నడిపాయి. అంతలేని దానిని నడపలేక చేతులెత్తేశాయి. ప్రస్తుతం ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా... పట్టించుకునే వారు లేరు. టమోటా లాంటి పంటలైతే ధరలేక రోడ్లపైనే పడేసే పరిస్థితి నెలకొంది.

◆ 2020లో హడావుడి
◆ ఆ తరువాత ఊసెత్తని పాలకులు
◆ ఉద్యానవన రైతులకు ప్రోత్సాహం కరువు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్‌ను రైల్‌ను 2020 సెప్టంబర్ తొమ్మిదవ తేదీన ప్రారంభించారు. అనంతపురం నుంచి నేరుగా ఢిల్లీకి ఈరైలు వెళ్లే ఏర్పాటు చేశారు. 332 టన్నులు టమోటా, అరటి, బత్తాయి, బొప్పాయి తదితర పంటలను ఎగుమతి చేశారు. ఆ తరువాత రెండు పర్యాయాలు ఇదే రకంగా ఎగుమతి చేశారు. అనంతరం దీని రప్పించి పంటలను పంపే ఏర్పాట్లపై ఎవరూ పట్టించుకోకుండా వదిలేశారు.

అంతన్నారు...ఇంతన్నారు..!

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తొమర్, రైల్వే శాఖ మంత్రి సురేష్ సి.అంగడి, ముఖ్యమంత్రి



కిసాన్ రైల్ ద్వారా టమోటాలను ఢిల్లీకి పంపుతున్న అప్పటి కలెక్టర్ గంధం చంద్రుడు, ఇతర అధికారులు(ఫైల్ ఫోటో)

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారులందరూ కలసి పచ్చ జెండాను ఊపి కిసాన్ రైల్‌ను ప్రారంభించారు. ఈ సమయంలో కాసన్ ఉడాన్, కిసాన్ రైల్‌ను నడుపుతున్నట్టు తొమర్ తెలిపారు. కిసాన్ రైల్ వల్ల వ్యవసాయ ఆర్థికాభవృద్ధి ఉపయోగపడుతుందని చెప్పారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద లక్ష కోట్ల నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు. అయితే ఇవన్నీ ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోయాయి.

ఉద్యానవపంటలకు అనంత ప్రసిద్ధి

ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యానవ పంటలకు ప్రసిద్ధి. సుమారు నాలుగున్నర లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగవుతాయి. ఏడాదికి సుమారు 58 లక్షల మెట్రిక్ టన్నులు పండ్లు, కాయగూరలు, పూలు దిగుబడి వస్తాయి. రాష్ట్రంలో వచ్చే దిగుబడుల్లో 80 శాతం ఇక్కడే పండుతాయి. ఒక్కోసారి పంటలకు ధర ఉండటం లేదు. ప్రధానంగా టమోటా పంట ఏటా ధర లేక రోడ్డుపై పడేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆగస్టు వరకు ధర అధికంగా ఉండేది. ఆ తరువాత నుంచి ధర పడిపోయింది. కొనేవాళ్లు లేక రోడ్డుపై టమోటాలను పడేస్తున్నారు. ఈ సమయంలో ధరవున్న ప్రాంతాల్లోకి ఈ పంటను తరలించే ప్రత్యేకమైన ఏర్పాట్లు ఏవీ లేకపోవడం గమనార్హం.

ప్రచారానికే పరిమితమైన కిసాన్ రైల్

ఎంతో ఆర్భాటంగా కిసాన్ రైల్‌ను అప్పుడు ప్రారంభించారు. ఇది ప్రచారానికే తప్పా రైతులకు ఉపయోగ పడింది ఏమీ లేదు. రైలు ముందుగా బుక్ చేసుకుంటేనే కిసాన్ రైల్‌ను పంపుతారు. దానికంటే ప్రత్యేకమైన వ్యవస్థ ఏదీ లేదు. ముందు నుంచి తాము సూచిస్తున్నది ఒక్కటే సాధారణ రైళ్లలోనే రెండు బోగిలను పంటల ఎగుమతులకు ఏర్పాటు చేయాలని, అది చేయడం లేదు. రవాణా ఛార్జీలను కూడా తగ్గించాలి. ఇలా చేస్తే ఉద్యానవన రైతులకు కొంత ఉపయోగంగా ఉంటుంది.

శివారెడ్డి ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా నాయకులు.

ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం

◆ ఓపీఎస్‌ను పునరుద్ధరించేంత వరకు పోరాటం
◆ అణచివేత ధోరణి విడనాడకపోతే ఉపాధ్యాయుల సత్తా చూపుతాం
◆ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు
◆ జిల్లాలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార యాత్ర



జాతా సందర్భంగా అనంతపురంలో యుటిఎఫ్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా రంగ సంస్కరణల నుంచి ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ బైక్‌ర్యాలీని ఉమ్మడి అనంతపురం జిల్లాలో గురువారం నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో యాత్ర ప్రారంభం అయ్యింది. యాత్ర హిందూపురం నుంచి పెనుకొండ, రాప్తాడు, అనంతపురం, ఉరవకొండ, గుంతకల్లు మీదుగా గురువారం రాత్రికి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 'ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకుందాం' అన్న నినాదంతో జాతా కొనసాగుతోందని చెప్పారు. 1974వ సంవత్సరంలో యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి విద్యా రంగ సమస్యల పరిష్కారంపై అనేక పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. అప్రెంటీస్ విధానం రద్దు, కౌన్సెలింగ్ విధానాన్ని నిలబెట్టుకోవటం, నెలవారీ ప్రమోషన్లు, ఉపాధ్యాయుల హక్కులు కాపాడుకుంటూనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం యుటిఎఫ్ కషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా హక్కుల్ని కాపాడుకునేందుకు పోరాటమే సరైన మార్గం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యా విధానాలు ప్రభుత్వ విద్యకు తీవ్ర నష్టదాయకంగా ఉన్నాయన్నారు. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వారంలో పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని గొప్పలు చెప్పారన్నారు. అధికారంలో వచ్చిన నాలుగేళ్ల అనంతరం జిపిఎస్ పేరుతో ఉద్యోగులకు నష్టం చేకూర్చే మరో పెన్షన్ విధానం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు 2024 ఎన్నికల్లో ఆయనకు గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమస్యల పరిష్కారంపై సాగించే పోరాటంలో భవిష్యత్తులో కలిసొచ్చే సంఘాలను కలుపుకుని విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమం కోసం పని చేస్తూనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు యుటిఎఫ్ కృషి చేసిందన్నారు. విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు, 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్ లాంటివి కూడా ప్రచురిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు సి.లింగమయ్య, ప్రధాన కార్యదర్శి వి.గోవిందరాజులు, గౌరవాధ్యక్షులు ఎస్‌వివి రమణయ్య, సహాధ్యక్షులు ఆర్.రామప్ప చౌదరి, సరళ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేంద్ర, కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శులు ప్రమీల, అర్జున్, రాముడు, రాష్ట్ర కౌన్సిలర్ సూర్యనారాయణ, ఆడిట్ కమిటీ మెంబర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉరవకొండ/గుంతకల్లు : యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా చేపట్టిన ప్రచార జాతా గురువారం సాయంత్రం ఉరవకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఉమాపతి, శ్రీనివాసులు, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి ఎం.సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-గార్లదిన్నె

దళితులపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో సామాజిక న్యాయం కోసం ఈనెల 29న విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం, సాగుభూమి, శ్మశాన వాటిక స్థలాలు, దళితుల హక్కుల కోసం సెప్టెంబర్ 20 నుంచి 27వతేదీ వరకూ జిల్లా, మండలాల్లో నిర్వహించే జీపుజాత కార్యక్రమంలో దళితులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వెంటనే దళితులపై దాడులను అరికట్టడంతోపాటు ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 29న విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాలో దళిత సంఘాలు, అంబేద్కర్ యువజన సంఘాలు, కార్మిక సంఘాలు, డప్పు కళాకారులు మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, మల్లికార్జున, వెంకటరాముడు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

వినాయకా.. సీఎంకు మంచి బుద్ధి ప్రసాదించు..

గణేష్ ప్రతిమకు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వినాయకా.. నీవైనా సిఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాధించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు గణేష్ ఉత్సవాల్లో భాగంగా అనంతపురంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమకు సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు, సిఐటియు 1వ నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ మాట్లాడుతూ సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేస్తూ హెల్త్ అండ్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, 60ఏళ్ల పేరుతో తొలగించిన, అనారోగ్యంతో బాధపడుతున్న, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉపాధి కల్పించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు డెత్ బెనిఫిట్స్‌ను ఇప్పించాలని, కార్మికులందరికీ స్థలం, పక్కా ఇల్లు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలిసి వచ్చే కార్మిక సంఘాలను కలుపుకుని దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, ఇంజినీరింగ్ సెక్షన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి కమిటీ సభ్యులు పోతలయ్య, రాయుడు, మల్లికార్జున, కార్మికులు పాల్గొన్నారు.



వినాయక ప్రతిమకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కాంట్రాక్టర్ అవినీతిపై విచారించాలి

25 నుంచి కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మడకశిర డివిజన్ శ్రీరామిరెడ్డి వాటర్ తాగునీటి సరఫరా పథకంలో చోటు చేసుకున్న రూ.6.50 కోట్ల అవినీతిపై ఉన్నత స్థాయి అధికారులతో సమగ్ర విచారించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం మడకశిర డివిజన్‌లో కార్మికుల వేతనాల్లో రూ.2500 చొప్పున 120 మంది కార్మికుల వేతనాలు కాంట్రాక్టర్ కలాం నాయుడు కోతలు విధించారని తెలిపారు. పైగా 120 మంది బోగస్ పేర్లతో నెలకు రూ.15 వేల చొప్పున 120 మందికి 2 సంవత్సరాల పాటు చెల్లించినట్లు తప్పుడు లెక్కలు చూపించి డబ్బులు కాజేశాడన్నారు. కాంట్రాక్టర్ కలాం నాయుడు ఇంత అవినీతి పాల్పడటానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పాత్ర ఉందన్నారు. కావున జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సిఇఓ కేతన్‌గార్గ్ స్పందించి ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను విచారణ అధికారులుగా నియమిస్తే వాస్తవాలు బయటకి వచ్చే పరిస్థితి ఉండదన్నారు. కావున డిఆర్‌ఓ, ఆర్‌డిఓ, పీడీ వంటి అధికారులను విచారణాధికారులు నియమించి కాంట్రాక్టర్ అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సిఐటియు శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్, కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు యన్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త సాయిచందనకు సన్మానం

అనంతపురం : చంద్రయాన్-3 కీలకపాత్ర పోషించిన శాస్త్రవేత్త సాయిచందను అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఇసిఇ విభాగం సెమినార్ హాల్ గురువారం చంద్రయాన్-3 మిషన్‌లో ఇంజినీర్ల పాత్రపై విభాగ అధిపతి చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జెఎన్‌టియు ఇసిఇ విభాగం పూర్వ విద్యార్థి, ప్రస్తుతం బెంగళూరులోని యు.ఆర్.రావు శాటిలైట్ సెంటర్‌లో సైంటిస్ట్ 'సి'గా పనిచేస్తూ చంద్రయాన్-3 మిషన్‌లో చురుగ్గా పాల్గొన్న సాయిచందనను సన్మానించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ. అరుణకాంతి, సీనియర్ ఆచార్యులు పి.రమణారెడ్డి, వి.సుమలత, డి.విష్ణువర్ధన్, జి.మమత, అరుణ మస్తానీ, లలితకుమారి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్త సాయిచందను సన్మానిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

బ్యాంకుల్లో రైతు తీసుకున్న రుణాలను మాఫీ చేయడంతోపాటు కరువు సహాయక చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయక కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతుసంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ సచివాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. ముఖ్యంగా శింగనమల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. పంట రుణాలు మాఫీ చేయాలని, పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు కనీసం ఎకరాకు రూ.50వేలు, విత్తనం వేయని రైతులకు ఎకరాకు రూ.30వేలు, హెచ్ఎల్‌సి 5వ డిస్ట్రిబ్యూటరీ బైపాస్ కెనాల్ పనులు పూర్తి చేసి సలకం చెరువు వరకూ సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కార్మికులకు జీవనోపాధి నిమిత్తం ప్రతి కుటుంబానికీ రూ.25వేల ఆర్థికసాయం, ఉపాధి హామీ పథకంలో అదనంగా 100 రోజులు పనులు పెంచాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కౌలు రైతులకు కౌలు రద్దు చేసి నష్టపరిహారం ఇవ్వాలని, ప్రయివేట్ బీమా కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని ప్రభుత్వం రంగంలోని బీమా కొనసాగించాలని, వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలని, స్మార్ట్ మీటర్లను బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాచేపల్లి వద్ద ఉన్న లిడ్‌క్యాప్ చెప్పుల పరిశ్రమ ఓపెన్ చేసి శిక్షణ పొందిన వారికి ఉపాధి చూపించాలని, కొత్తవారికి ట్రైనింగ్ ఇవ్వాలని, శ్మశానం లేని గ్రామాలకు స్థలం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుంకన్న, జయరాముడు, ఎర్రిస్వామి, ఆంజనేయులు, సూర్యప్రకాష్, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.



సచివాలయ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

ఔషధాల వాడకంపై అవగాహన తప్పనిసరి

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజల్లో ప్రతికూల ఔషధ ప్రతిచర్య పర్యవేక్షణ తప్పనిసరి అని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్‌వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫార్మకాలజీ విభాగం హెచ్ఒడి షారోన్ సోనియా ఆధ్వర్యంలో 3వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం వాడే మందులు వల్ల ఏవైనా ప్రతికూల చర్యలు, ఎలర్జీలు లాంటివి కలిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 180 3024ను సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రతి ఆసుపత్రిలో ఎడిఆర్ బాక్సులను ఉంచుతున్నామన్నారు. మీ విలువైన సలహాలు, సూచనలను ఉత్తరాల ద్వారా అందులో వేసి తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లు డాక్టర్ భీమసేనాచారి, డాక్టర్ వేముల శ్రీనివాసులు, డాక్టర్ మల్లేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎల్.సుబ్రమణ్యం, ఫారా కళాశాల డాక్టర్లు ఆశాలత, పద్మ శ్రావణి, రియాజ్, కుష్బూ, ఫర్హానా, ఫిరోజ్, శివకుమార్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



గురజాడ అప్పారావుకు నివాళులు అర్పిస్తున్న ఐద్వా నాయకులు

సమాజ దార్శనికుడు గురజాడ అప్పారావు

◆ రచయిత్రి శశికళ ◆ ఐద్వా ఆధ్వర్యంలో గురజాడ జయంతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో వివక్ష, అంటరాని తనాన్ని రూపుమాపి సమసమాజ స్థాపన జరగాలని తన రచనలతో జనజాగృతి చేసిన ఆధునిక సమాజ దార్శనీకుడు గురజాడ అప్పారావు అని ప్రముఖ రచయిత్రి శశికళ తెలిపారు. మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలను ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం అనంతపురం నగరంలోని ఒకటవ రోడ్డు, శారదా బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినుల ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన జయంతి వేడుకల్లో రచయిత్రి శశికళ ముఖ్య అతిథిగా హాజరై గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గురజాడ అప్పారావు 1915లో సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన రచనలతో సమాజాన్ని తట్టి లేపారన్నారు. సమాజంలో మార్పు రావాలని రచనలు చేశారో ఆ స్వాప్నికత ఈ రోజుకు ఇంకా నెరవేరని పరిస్థితి నెలకొందన్నారు. గురజాడ చేసిన రచనల్లో కన్యాశుల్కం ప్రధానమైన నాటకంగా నిలిచి సమాజనం నూతనోత్తేజాన్ని పొందిందన్నారు. దేశమును ప్రేమించుమన్నా, దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అంటూ గురజాడ చేసిన సార్వజనిన సూత్రాన్ని ఆలోచిస్తే నేడు దేశభక్తితో జరుగుతున్న ఉన్మాదాలు సమాజం అర్థం చేసుకోవచ్చు అన్నారు. సమాజంలో మనుషులు మనుషులుగా బతకాలని, కులాలు, వర్ణాలు, మతాలు అడ్డురాకూదని వెలుగెత్తి చాటారన్నారు. స్త్రీ, పరుషుల సంబంధాలు స్నేహపూర్వితమైన సంబంధాలు ఉండాలని కోరుకున్నారని తెలిపారు. సమసమాజ స్థాపన జరగేందుకు గురజాడ రచనలను చదవాల్సిన అవసరం ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ గురాజడ అప్పారావు రచనలు సమాజాన్ని చైతన్యాన్ని చేశాయన్నారు. ఆయన రచనలను నేటి యువత చదవాల్సిన అవసరం ఉందన్నారు. 170 సంవత్సరాల క్రితమే గురజాడ ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తుందని చాటి చెప్పాడన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో గురజాడ జయంతి వేడుకలు రాష్ట్రం, జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురాజడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి మహాకవుల జయంతి కార్యక్రమాలు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించి వారిని స్మరింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, ఉపాధ్యాయులు పుల్లమ్మ, హైమావతి, సునంద, వేళాంగణి, ప్రజానాట్య మండలి నాయకురాలు క్రిష్ణవేణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

సిఐటియు జిల్లా నాయకులు నాగభూషణం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అర్హులైన అంగన్‌వాడీలకు వెంటనే ఉద్యోగోన్నతి కల్పించాలని సిఐటియు జిల్లా నాయకులు నాగభూషణం డిమాండ్ చేశారు. బుక్కరాయసముద్రానికి అర్హతలు లేని సిడిపిఒను నియమించడంతో సిఐటియు నాయకులకు గురువారం జిల్లాకేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శింగనమల క్లస్టర్‌లోని బుక్కరాయసముద్రం మండల సిడిపిఒను అక్రమ మార్గంలో నియమించారని ఆరోపించారు. ఇదే మండలంలోని పూసల కాలనీలో విధులు నిర్వహిస్తున్న చంద్రకళకు అన్ని అర్హతలు ఉన్నా అధికారులు మొండిచేయి చూపారన్నారు. అయితే కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అర్హతలు లేని వారిని సిడిపిఒగా నియమించడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అర్హతలు ఉన్న వారిని సిడిపిఒగా నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు నాయకులు నాగేంద్ర, కాత్యాయణి, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైకి మురుగునీరు వదిలితే చర్యలు

ప్రజాశక్తి-కుందుర్పి

ఇంట్లో ఉన్న మురుగునీటిని రహదారిపైకి వదిలితే కఠిన చర్యలు తప్పవని సర్పంచి మారుతీశ్వరరామ్మూర్తి గృహ యజమానులను హెచ్చరించారు. 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమంలో భాగంగా గురువారం సర్పంచి పంచాయతీ అధికారులతో కలిసి స్థానిక ప్రధాన వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లలోని మురుగునీటిని రహదారిపైకి వదలడం వల్ల నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారిపైకి మురుగునీటిని వదిలే పైపులను బంద్ చేయించారు. ఇకపై రహదారిపైకి మురుగునీరు వదిలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, బుష్ణి ఆర్ట్స్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ అరుణ, అధ్యాపకులు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ నాగేంద్ర, వాలంటీర్లు, ఆశా వర్కర్స్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



ఇంటి నుంచి వెలువడే మురుగునీటి పైపును బంద్ చేయిస్తున్న పంచాయతీ అధికారులు

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆనందదాయకం

అనంతపురం కలెక్టరేట్ : మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేయడం ఆనందదాయకమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్.ఎం.ఉమామోహన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ ఇప్పటికే నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్, మున్సిపాలిటీ, జిల్లా పరిషత్, సర్పంచి, గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థల్లో మహిళలకు 60 శాతం కల్పించారన్నారు. ఈ విధానం దేశానికి ఆదర్శంగా మారిందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడాన్ని రాష్ట్రంలోని ఆడపడుచులందరూ గర్విస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశం మహిళా సాధికారత అని గత నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలు సమాన ప్రాతినిధ్యం ద్వారా మహిళా సాధికారత సాధించిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నిలుస్తుందన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు

గుత్తి : మండలంలోని రజాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సేవాఘడ్‌లో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ముంబైలోని సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. రెండు గురుకుల పాఠశాలల్లో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో సాహితి గగన్ మహాల్ సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈఓ మఠం వెంకటరావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్) స్కీం కింద ఒక్కో గురుకుల పాఠశాలలో 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను మంజూరు చేశారు. అనంతరం తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ప్రతాప్‌రెడ్డి, మఠం వెంకటరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ మురళీకృష్ణ, సేవాలాల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు నియోజకవర్గ వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం



బాలపోతన్న రామకృష్ణారెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఆత్మకూరు : రాప్తాడు నియోజకవర్గ వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షులను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం ప్రకటించారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా ఆత్మకూరుకు చెందిన జొన్నగిరి బాలపోతన్న, యువజన విభాగం అధ్యక్షుడిగా అనంతపురం రూరల్‌కు చెందిన తుమ్మాట ఆంజనేయులు, రైతు విభాగం అధ్యక్షుడిగా చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలకు చెందిన కదిరి రామకృష్ణారెడ్డి, ఐటీ విభాగం అధ్యక్షుడిగా అనంతపురం రూరల్‌కు చెందిన బూదేటి చంద్రమోహన్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అనంతపురం రూరల్‌కు చెందిన గువ్వల అంజనాదేవిని నియమించారు.

పి.యాలేరు సచివాలయం తనిఖీ

ఆత్మకూరు : మండల పరిధిలో పి.యాలేరు సచివాలయాన్ని ఎంపిపి సుబ్బర హేమలత, ఉపాధ్యక్షులు నీలిమా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలపోతన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ రహదారి పనులను పూర్తి చేయాలి

ఉరవకొండ : ఉరవకొండ నుంచి వెలిగొండకు వెళ్లే రహదారి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని వైస్ ఎంపీపీ నరసింహులు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య సూచించారు. ఈమేరకు గురువారం రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ నుంచి వెలిగొండకు వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ఆయన స్పందించి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.85 కోట్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్నఅహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, వైసిపి నాయకులు ఆంజనేయులు, ఉలిగప్ప, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

వృద్ధాశ్రమాలు లేని సమాజం కావాలి

డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వృద్ధాశ్రమాలు లేని సమాజం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం నగరంలోని రాజు రోడ్డులోని వాసవీ వృద్ధాశ్రమంలో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తి యోగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమలు ఎంత తక్కువగా ఉంటే మన సంసృతి, సంప్రదాయాలు అంత పరిరక్షించిన వారం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవచన కర్త అన్నాజీ, సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్, డిస్కవర్ అనంతపురం అనిల్‌కుమార్‌రెడ్డి, టౌన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, వృద్ధాశ్రమ అధ్యక్షులు ఎన్.నాగభూషణం, మురళి, మధు, తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని గురువారం ఐద్వా ఆధ్వర్యంలో పాతూరు కస్తూరిబా పాఠశాలలో చిత్రపటానికి పూలామల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, యుటిఎఫ్ నాయకులు ప్రజ్ఞా సురేష్ మాట్లాడుతూ గురజాడ రచనలను నేటి యువత చదవాలని, గురజాడ ఆశయాల సాధనకు అందరం కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, నగర అధ్యక్షురాలు హసీనా, ఉపాద్యాయులు పూర్ణమ్మ, శోభాకుమారి, సరళ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాతూరు నెంబర్ 2 హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు నవీద అధ్యక్షతన చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్, డాక్టర్ ప్రసూన, అధ్యాపకురాలు జి.యమునరాణి గురజాడ అప్పారావు రచనలు సమాజాన్ని జాగృతం చేశాయని తెలిపారు. ముఖ్యంగా అసమానతలు, వివక్ష రూపుమాపడంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. సాంఘిక సంస్కర్త, అభ్యుదయ కవిగా గురజాడ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని సమాజానికి పెంపొందించారని గుర్తు చేశారు. ఈ ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, శ్రీనివాసులు, ఊర్మిల, నాగేంద్ర, రామకృష్ణ, జెవివి నగర అధ్యక్షుడు రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లక్ష్మినారాయణ, నూర్, నవీన్‌కుమార్, మన్సూర్, శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.



గురజాడకు నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

గుత్తి : గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు షేక్షావలి, కృష్ణవేణి, దీవెనమ్మ నారాయణరెడ్డి, మద్దిలేటి, నారాయణ శెట్టి, చెన్నారెడ్డి, నాగేశం తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి : ఎడిఎ

ప్రజాశక్తి-డి.హీరేహాల్

పంట సాగు చేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించాలని రాయదుర్గం వ్యవసాయ సహాయ సంచాలకులు(ఎడిఎ) లక్ష్మీనాయక్ సూచించారు. మండల వ్యాప్తంగా చేపట్టిన ఈ పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదుకు ఈ నెల 30 వరకూ గడువు ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని మల్లికేతి, పులకుర్తి, నాగలాపురం ఆర్‌బికెలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎఒ క్రిష్ణకిశోర్‌రెడ్డి, టెక్నికల్ ఎఒ అధికారి అహ్మద్‌బాషా, ఆర్‌బికె సిబ్బంది, రైతులు ఉన్నారు.

బొమ్మనహాల్ : పంట సాగు చేసిన రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఎడిఎ లక్ష్మీనాయక్ సూచించారు. మండల పరిధిలోని ఉద్దేహాళ్ గ్రామంలో సాగుచేసిన వరి పంటను ఎడిఎ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిఎ రైతులకు పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రసాయన ఎరువులు, క్రిమిసంహార మందుల వినియోగం గురించి వివరించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రసాయన ఎరువులు తక్కువ మోతాదులో వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువుల బదులు పశువుల పేడ, గొర్రెల ఎరువు, కోడిపెంట పంట పొలాలకు మంచి పోషకాలు అందిస్తాయని తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎఒ సాయికుమార్, టెక్నికల్ ఎఒ అహ్మద్‌బాషా, ఆర్‌బికె సిబ్బంది, రైతులు ఉన్నారు.



డి.హీరేహాల్‌లో ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎడిఎ లక్ష్మీనాయక్

పట్టుసాగులో అధిక దిగుబడులు

ఎంపిపి దాసరి సునీత, సర్పంచి పార్వతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పట్టు సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంపిపి దాసరి సునీత, సర్పంచి పార్వతి సూచించారు. గురువారం మండలంలోని కొట్టాలపల్లి సచివాలయంలో జిల్లా సెరికల్చర్ ఆఫీసర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో 'పట్టుబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పట్టు పంట సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. అలాంటి రైతులకు షెడ్డు కట్టుకోవడానికి, మొక్కలు నాటుకోవడానికి, ఇతర సామగ్రి కోసం ప్రభుత్వం పెద్దమొత్తంలో సబ్సిడీ రూపేనా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అంతేగాకుండా రైతులు తక్కువ ఖర్చుతో అధిక ఆధాయం పొందవచ్చన్నారు. పట్టు సాగు చేసే రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా పట్టు పరిశ్రమ శాఖ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందజేస్తారన్నారు. ఎంపిపి, సర్పంచి మాట్లాడుతూ సిఎం జగన్ వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఆర్‌బికెల ద్వారా రైతులకు సబ్సిడీ ధరలకే విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారన్నారు. అదేవిధంగా సిరికల్చర్ అభివృద్ధి చేసే దిశగా అధికారులు రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరికల్చర్ ఆఫీసర్ ఓబులేసు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి దాసరి సునీత

అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు..

కొనసాగిన టిడిపి దీక్షలు.. పలుచోట్ల నేతల అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రశ్నించే ప్రతిపక్షాలను గొంతు నొక్కుతూ, నిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేస్తూ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. బాబుకు తోడుగా నియంతపై పోరాటానికి మేము సైతం అంటూ రామ్‌నగర్ కమ్మభవన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 9వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు పెద్ద ఎత్తున వివిధ రంగాలలోని నిపుణులు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు తలారి ఆదినారాయణ, శివ బాల, నగర అధ్యక్షురాలు విజయ శ్రీ రెడ్డి, సంఘ తేజస్విని హాజరై మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని మండిపడ్డారు. నిరాధార ఆరోపణలో న్యాయవ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తోందన్నారు. మచ్చలేని చంద్రుడిలా కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటకు వస్తారని తెలిపారు. ఈ దీక్షలో ఐదవ క్లస్టర్ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు సాకే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిర్రోళ్ల రామాంజి, అధికార ప్రతినిధి వన్నూరప్ప, సుజాత, వెంకటేష్‌లు చేపట్టారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం సాయంత్రం టిడిపి నాయకులు స్థానిక సప్తగిరి సర్కిల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించేందుకు పూనుకున్నారు. ఈ ర్యాలీకి మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్న జనసేన నాయకులను సప్తగిరి సర్కిల్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డగించారు. ఇందుకు జనసేన నాయకులు, వీర మహిళలు ప్రతిఘటించడంతో పోలీసులు, నాయకులు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో బలవంతంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సంజీవరాయుడు, రాపా ధనుంజయ్, జయమ్మ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, కార్యదర్శులు అంజి, ఆకుల అశోక్, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్‌కుమార్, నాయకులు తాతయ్య, వీరమహిళలు అనసూయ, దాసరి సరిత ఉన్నారు.

ఉరవకొండ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఎస్సీ సెల్ విభాగం నాయకులు గురువారం పట్టణంలో నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో వారు మాట్లాడుతూ నిజాయితీ పరుడైన చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. 45ఏళ్ల తన రాజకీయ చరిత్రలో చంద్రబాబు నిరంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే పని చేశారన్నారు. వెంటనే చంద్రబాబును విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు రామకృష్ణ, నాగరాజు, చంద్రశేఖర్, వన్నూరుస్వామి, రామాంజనేయులు, కృష్ణ, శంకరయ్య, గోవిందు, అంజినయ్యతో పాటు మహిళలు పాల్గొన్నారు.

శింగనమల : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని మసీదులో చేపట్టిన ప్రత్యేక ప్రార్థనలకు వెళ్తున్న టిడిపి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమానికి వస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డిని అరెస్టు చేసి బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా మసీదులో చేసిన ప్రార్థనల్లో నియోజకవర్గ పరిశీలకుడు ముక్తియార్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గాండ్ల విశాలాక్షి, మాజీ కన్వీనర్ అశోక్, మాజీ సర్పంచి చెదుల్ల నారాయణస్వామి, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, కేశన్న, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, బోలే అక్కులప్ప, కురుబ రాజు, పార్లమెంట్ మైనారిటీ కమిటీ అధికార ప్రతినిధి వెంకటాపురం దాదు, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. ఈమేరకు గురువారం తన ఛాంబర్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన బార్‌కోడ్ మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో బార్‌కోడ్ మిషన్లను పంపిణీ చేసిందన్నారు. అంతకుముందు విడపనకల్ 1వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇంఆర్‌డి సత్యబాబు, పంచాయతీ సెక్రటరీలు మహబూబ్‌బాషా, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, గోపాలకృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాలంటీర్ ఆత్మహత్య



మృతిచెందిన రంగనాయకులు

గుత్తి : పట్టణంలోని పాత సిపిఐ కాలనీకి చెందిన ఓ వాలంటీర్ గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాలనీకి చెందిన రంగనాయకులు (28) వార్డు వాలంటరీగా పని చేస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు ఇద్దరూ లేరు. దీంతో ఒంటరి జీవితం భరించలేక ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గుత్తి : మండలంలోని కొజ్జేపల్లి గ్రామ శివారులో మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వంశీ (21) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వంశీ వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతిమను తెచ్చేందుకు ఈనెల 17న ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వెళ్లాడు. అక్కడ కొనుగోలు చేసిన అనంతరం ట్రాక్టర్‌లో ఉంచి వెనకాల ద్విచక్ర వాహనంలో గ్రామానికి వస్తుండగా కొజ్జేపల్లి గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వంశీని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

రక్తదాన శిబిరం

ఉరవకొండ : విడపనకల్ మండలం జనార్ధనపల్లి గ్రామంలో రామాలయ గణేష్ ఉత్సవ సమితి సహకారంతో గురువారం రక్తదానం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో యువకులు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడినవారం అవుతామన్నారు. కావన యువత రక్తదానానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ధనుంజయనాయుడు, వైద్య సిబ్బంది, నిర్వాహకులు ఎం.అశోక్, బి.హరీష్, పి.సతీష్, బి.అక్కులప్ప, కె.సాయి, ప్రతాప్, సందీప్, గోవర్ధన్, విజయ్, అనిల్, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

నార్పల : మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ వినాయక ప్రతిమను గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం నుంచి మండల కేంద్రంలోని పలు వీధుల గుండా ప్రతిమను ఊరేగించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

వైఎస్‌ఆర్ బీమా అందజేత

శింగనమల : మండల కేంద్రంలో ఆనారోగ్యంతో మృతిచెందిన వడ్డే రమేష్ కుటుంబానికి వైఎస్‌ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను ఎంపిడిఒ నిర్మల కుమారి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి లక్ష్మీనారాయరెడ్డి, నవీన్, అనిల్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ నాగేంద్ర, మహిళా పోలీసు హరిత, గ్రామస్థులు పాల్గొన్నారుజ

ఎమ్మెల్యే బాలయ్యపై మంత్రి అంబటి వ్యాఖ్యలు తగదు

శింగనమల : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై అసెంబ్లీలో మంత్రి అంబటి రాంబాబు రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం హేయమైన చర్య అని అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. అసెంబ్లీలో గురువారం చోటు చేసుకున్న ఘటన యావత్ తెలుగు రాష్ట్రాల్లోని నందమూరి అభిమానులను తీవ్ర ఆగ్రహావేశాలను కలిగిస్తోందన్నారు. నందమూరి కుటుంబంపై అవాకులు, చావాకులు పేలితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వెంటనే అంబటి స్పందించి నందమూరి బాలకృష్ణకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు ఆత్మకూరులో 'జగనన్నకు చెబుదాం'

ఆత్మకూరు : మండల కేంద్రంలోని కనకదాస కళ్యాణ మండపంలో కలెక్టర్ గౌతమి అధ్యక్షతన శుక్రవారం జగనన్నకు చేపుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షురాలు హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26న ప్రభుత్వ వాహనం వేలం

కణేకల్లు : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ వాహనాన్ని ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు సిడిపిఓ ఎల్లమ్మ తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ప్రభుత్వ వాహనం విలువను రాయదుర్గం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యూనిట్ అధికారి రూ. 30 వేలుగా నిర్ణయించారన్నారు. వేలం పాల్గొనే వారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కణేకల్లులో రూ. 2 వేలు డిడి తీయాలన్నారు.

బీసీ క్రెడిట్ కార్పొరేషన్ యూనిట్ల పరిశీలన

నార్పల : మండల కేంద్రంలో జగనన్న చేదోడు పథకం కింద మంజూరైన బీసీ క్రెడిట్ కార్పొరేషన్ యూనిట్లను ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ దివాకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన గురించి లబ్ధిదారులకు వివరించి త్వరలోనే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి శ్రీరాములు, మేజర్ పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, ఎంపిడిఒ కార్యాలయ జూనియర్ సహాయకులు నరేంద్ర, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌరసంద్ర మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపన

బెలుగుప్ప : మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గౌరసంద్ర మారెమ్మ అమ్మవాని గురువారం ప్రతిష్టించారు. ఇందులో భాగంగా అమ్మవారికి గంగపూజ చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట, అమ్మవారి త్రిశూల, పాదాల ప్రతిష్ట చేశారు. తర్వాత సుప్రభాత సేవ, గణపతి హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పురోహితుల హోమాలు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపాలి

ఉరవకొండ : వేసవికాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నీటితో నింపాలని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు వేసవికాలంలో తాగునీటి సమస్యల రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ధనుంజయ, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగరాజు, కాంట్రాక్టర్ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జైలులో చంద్రబాబుకు ప్రాణహాని : బండారు శ్రావణిశ్రీ

శింగనమల : టిడిపి అధినేత చంద్రబాబుకు సబ్‌జైలులో ప్రాణహాని ఉందనినియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేని కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడంతోపాటు బెయిల్ రాకుండా చేసి జైలులోనే చంపేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. చంద్రబాబుకు జైలులో భద్రత లేదన్నారు. విపరీతంగా దోమలు కుడుతున్నాయన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజమండ్రి రూరల్ మండలం ధవళేశ్వరానికి చెందిన గంజేటి వీరవెంకట సత్యనారాయణ డెంగీ వ్యాధితో మరణించాడన్నారు. అలాంటి జైలులో చంద్రబాబును ఉంచడం బాధాకరమన్నారు. చంద్రబాబుకు ఏం జరిగినా సైకో జగన్ బాధ్యత వహించాలని హెచ్చరించారు.